కథ

# పాప కూడా అమ్మ అవుతుందిగా!

ఫెడీల్‌మని తన్నాను బలంగా...

''అమ్మా..!'' అని అరుస్తూ రెండు చేతుల్తో తొడలమధ్య పట్టుకుని మా బావ పడిపోతుండగా, లోపలనించి వచ్చిన మా అత్తయ్య పెద్దగా ఏదో అనబోతుంటే విసురుగా ఒక్కతోపు తోసాను.

అడ్డమొచ్చిన మా ఆడబడుచునీ అలాగే సత్కరించి బయటపడ్డాను.

★★★

కళ్ళు నులుముకుంటూ తలుపు తీసాడు నాన్న.

''పడుకున్నారా నాన్నా?'' అంటూ లోపలికి నడిచాను.

నా అవతారాన్ని చూస్తూనే ఆశ్చర్యంగా పైకి లేస్తున్న అమ్మతో- ''అన్నమేమైనా ఉందామ్మా..? చాలా ఆకలిగా ఉంది. మధ్యాహ్నం నుంచీ ఏమీ తినలేదు...'' అన్నాను.

ఏదో అనబోయిన అమ్మ ఆ ప్రయత్నం విరమించుకుని వంటింట్లోకి నడిచింది.

నాన్న నెమ్మదిగా తలుపేసి వచ్చి కూర్చున్నాడు.

అమ్మ కంచంలో అన్నం పెట్టగానే దానిమీద దాడి చేసాను. నేను తింటున్నంతసేపూ ఎవరూ ఏం మాట్లాడలేదు. కడుపునిండా తిన్నాక చెయ్యి కడుక్కుని అమ్మ చెంగుకి మొహం తుడుచుకుంటూ చెప్పాను.

''ఈవాళ సాయంత్రం గౌరవనీయులైన మీ అల్లుడిగారిని, అయ్‌మీన్ బావని, నా పవిత్రమైన కుడికాలితో బలంగా తన్నాల్సి వచ్చింది. పనిలోపనిగా నీ ఆడబడుచుమీదా నా ఆడబడుచు మీదా కూడా చెయ్యి చేసుకోవాల్సి వచ్చింది.''

ఇలాంటిదేదో జరిగి ఉంటుందని ముందే ఊహించిందేమో అమ్మ. మౌనంగా ఉంది.

నాన్న మాత్రం చిన్నగా నిట్టూర్చాడు.

మళ్ళీ నేనే అన్నాను.

''ఇందులో సంతోషించాల్సిందే తప్ప బాధపడాల్సిన విషయమేదీ లేదు నాన్నా..! మీరంతా చెప్పుకునే భూదేవికున్నంత సహనం నాకు లేకపోవచ్చు. కానీ ఇన్నాళ్ళు నేను సహించగలిగిన దానికంటే ఎక్కువ సహనాన్ని చూపించాను. కానీ..ఇప్పుడు నన్ను నమ్ముకుని మరో జీవం ఊపిరిపోసుకుంటున్న తరుణంలో ఇంకా ఓపికతో ఉండగలిగేంత ఓపికా, శక్తీ నాకు లేవు. నా శరీరానికంతకన్నా లేవు..''.

నేనన్న మాటలు అర్థంకాగానే అమ్మ నన్ను ఆప్యాయంగా తన గుండెలకి హత్తుకుంది.

నేను తన కౌగిట్లో అలాగే ఒళ్ళు మరిచిపోయి ప్రశాంతంగా నిద్రపోయాను. పెళ్ళికాక ముందులా..

★★★

నేను ఇంటర్ సెకండియర్ చదువుతుండగా అత్తయ్యా, మావయ్యా వచ్చారు ఓరోజు.

అత్తయ్య అంటే మా నాన్నకి సొంత చెల్లే. వాళ్ళ ఊరికీ, మా ఊరికీ మధ్య ఓ గంట ప్రయాణం. అంతే.

మర్నాడు పొద్దున్న వాళ్ళు వెళ్ళిపోయాక నాన్న నన్ను పిలిచాడు.

''అత్తయ్య వచ్చింది నీ విషయం మాట్లాడటానికే.. బావని పెళ్లి చేసుకోవడం నీకిష్టమేనా..?''

నాకేం చెప్పాలో అర్థం కాలేదు.

''అత్తయ్య అడిగితే నిన్నడిగి చెప్తానన్నాను. ఈవాళ కాపోతే రేపైనా నువ్ పెళ్ళయి వెళ్ళాల్సిన దానివే. ఎక్కడో దూరంగా కాకుండా మా కళ్ళెదురుగా ఉంటావని మా ఆశ. నువ్ ఆలోచించి చెపితే నేనం అత్తయ్యకి ఏ సంగతి చెబుతాను'' అంటూ లేచాడు నాన్న.

ఆ రాత్రి అదే విషయం అమ్మని అడిగితే, ''అంతా దగ్గరగా ఉంటామనే ఒకే కారణంతో మాత్రం ఈ పెళ్ళి చేసుకోకు. నిజంగా నీకు బావ నచ్చితేనే చేసుకో..'' అంది.

బావ అందంగానే ఉంటాడు. కొంచెం సీరియస్‌గా ఉంటాడంతే..ఏదో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం..తనని పెళ్ళి చేసుకోవడానికి ప్రత్యేకమైన కారణాలేవీ కనపడనట్టే, చేసుకోకపోవడానికి అభ్యంతరాలు కూడా నాకేమీ తోచలేదు. అందుకే ఆ మర్నాడు నాన్న ఆ విషయం మళ్ళీ అడిగితే. ''నీ ఇష్టం నాన్నా..?'' అన్నాను.

ఆ వేసవిలోనే మా పెళ్ళి జరిగింది. అయిదు లక్షల డబ్బుతోపాటు నలభై తులాల బంగారం కూడా కట్నంగా ఇచ్చాడు నాన్న.

పెళ్ళిలో మా ఫ్రెండ్ ఒకమ్మాయి ''మీ బావ అందగాడేనే..!'' అంటే, ''ఏం..నేను అందంగా లేనా..?'' అన్నాను పౌరుషంగా. అది విన్న బావ అదోలా చూసాడు.

ఫస్ట్ నైట్ రోజు.

నేను గదిలోకి వెళ్లేసరికి మంచంపైన కూర్చుని సిగరెట్ కాలుస్తున్నాడు బావ.. అప్రయత్నంగా ముక్కుకి చెయ్యి అడ్డం పెట్టుకున్నాను. అది చూసి లేచి దగ్గరగా వచ్చి అన్నాడు.

''పడదా..?''

అవునన్నట్టు తలూపాను.

సిగరెట్ మొత్తం పీల్చి ఒక్కసారిగా ఆ పొగ నా మొహం పైకి వదిలాడు.

ఉక్కిరిబిక్కిరై పెద్దగా దగ్గుతూ చిరాగ్గా మొహం పక్కకి తిప్పుకున్నాను.

కిటికీలోంచి సిగరెట్ బయటపారేసి వచ్చి, ''సారీ.. ఊరికే..సరదాకి'' అంటూ మంచం దగ్గరికి నడిపించుకెళ్ళాడు.

కాసేపేమైనా మాట్లాడుతాడేమో అనుకున్నాను. కానీ తను వెంటనే...

ఆ పావుగంటా నరకం అనిపించింది. విపరీతమైన నొప్పి, బాధ తప్ప వేరే ఏ ఫీలింగ్ కలగలేదు. కానీ అంత బాధలోనూ ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే నాకు బాధ కలిగించిన అదేపని బావకి ఆనందం కలిగించటం.

నా మీదనించి పక్కకి ఒరుగుతూ అన్నాడు-

''నీ అందం చూసి పెళ్ళి చేసుకున్నాననుకుంటున్నావేమో..? నేను నిన్ను పెళ్ళి చేసుకున్నది మీ నాన్న ఆస్థి చూసి..''

★★★

అత్తయ్య, మావయ్య, బావా, నేనూ, మా ఆడబడుచూ మొత్తం అయిదుగురం ఆ ఇంట్లో..మా మావయ్య ఇంట్లో ఉన్నా లేనట్టే..ఏ విషయంలోనూ ఆయనకి సొంత అభిప్రాయాలూ, నిర్ణయాలూ ఉన్నట్టనిపించేది కాదు...

రోజూ పొద్దున్న గిన్నెలు కడగటం, బట్టలు ఉతకటం, తర్వాత స్నానం చేసి అన్నం తిని అన్నీ సర్దుకునేసరికి రెండయ్యేది. ఓ గంట పడుకుని లేచాక మళ్ళీ గిన్నెలు కడగటం, టీ పెట్టడం, ఇల్లు ఊడ్చి.., సాయంత్రం వంటా, రాత్రి భోజనాలయ్యాకా వంటిల్లు సర్దుకుని బెడ్‌రూంలోకి వచ్చేసరికి నీరసంగా ఉండేది. బావ నాతో ఏదైనా సరదాగా మాట్లాడితే బావుండుననిపించేది నాకు..కానీ తను మాత్రం నా ప్రమేయం లేకుండా నా శరీరంతో తృప్తిపడటానికే ప్రాధాన్యమిచ్చేవాడు.

నేనక్కడికి వెళ్ళిన వారం రోజులకి...

నేను బెడ్‌రూంలోకి వెళ్ళగానే టేబుల్ కిందనించి బాటిల్ తీసి ఓపెన్ చేసి-

''ఫ్రిజ్ వాటర్ తే...!'' అన్నాడు.

గ్లాస్‌లో కొంచెం పోసి నిండా నీళ్ళు పోసాడు.

''నీకేమైనా అభ్యంతరమా..?''

నేనేం మాట్లాడలేదు.

''కొంచెం రుచి చూస్తావా..? బావుంటుంది...''

''ఛీ..''

''ఓసారి రుచి చూస్తే వదలవు తెలుసా..?'' అంటూ హఠాత్తుగా లేచి నా నోటిదగ్గర పెట్టాడు గ్లాసు. నేను అదిరిపడి దూరంగా జరగబోతుండగా నా తల గట్టిగా పట్టుకుని బలవంతాన నా నోట్లో పోసాడు. వెగటువాసన. గొంతులో భరించలేని మంట. కోపంతో గట్టిగా విదిలించుకుని వాష్‌బేసిన్ దగ్గరకెళ్ళి నోరు కడుక్కుని వచ్చి

మాట్లాడకుండా పడుకున్నాను.

నా పక్కన వచ్చి పడుకుని తన వైపు తిప్పుకుంటూ నా పెదాల పైన ముద్దుపెట్టుకోబోతుంటే గుప్పున వాసనొచ్చింది.

''వద్దు..నాకిష్టం లేదు'' అన్నాను దూరంగా జరుగుతూ.

''నాకిష్టమే..!'' అంటూ మీదకి వచ్చాడు. నేను పైకి లేవబోతుంటే కదలకుండా పట్టుకుని నా పెదాలని తన పెదాలతో బలంగా నొక్కిపెట్టాడు. ఆ వాసనకి వాంతి వచ్చినట్టయింది. ఊపిరాడక గింజుకున్నాను. నాకు స్పృహ తప్పుతుందనుకుంటుండగా పట్టు సడలించాడు.

పది నిముషాల తర్వాత అలసిపోయి నా శరీరం మీద నించి పక్కకి ఒరుగుతూ..

''ఏ పనయినా వద్దంటే నాకింకా పంతం పెరుగుతుంది. ఇంకెప్పుడు నా ఇష్టానికి ఎదురుచెప్పకు..'' అన్నాడు.

నేను వద్దన్న కొద్దీ తనింకా రెచ్చిపోతాడని అర్ధమయి మర్నాడు తను మళ్ళీ తాగి నా పక్కకి చేరినప్పుడు అభ్యంతరం చెప్పకుండా మౌనంగా భరించాను.

''అంటే నీకిది అలవాటేనన్న మాట. మరి నిన్న ఎందుకు నాటకమాడావ్? మొదటిసారి తాగి నిన్ను అనుభవించిందెవరు..? మీ కాలేజ్ ఫ్రెండా?''

ఓ క్షణం తనేం మాట్లాడుతున్నాడో అర్ధం కాలేదు. అర్ధమయ్యాకా మాత్రం సాచిపెట్టి కొట్టాలనిపించింది. అసహ్యంతో బలంగా నా మీదనించి తోసేయటానికి ప్రయత్నిస్తుంటే అప్పుడు తన పని మొదలెట్టాడు. నేను నిస్సత్తువగా ఉండిపోయాను. ఆ బాధలో హఠాత్తుగా నెమ్మదిగా మబ్బులు తొలిగిపోయినట్టుగా నాకో విషయం అర్ధమైంది. నేను మామూలుగా ఉంటే నన్నునుభవించటంలో తనకి తృప్తిలేదు. తన మాటలతో చేతలతో ఏదోలా నన్ను బాధపెట్టి ఆ బాధలో తను తృప్తి పడుతున్నాడు. ఎదుటిమనిషిని హింసించి తృప్తిపడేవాళ్ళని శాడిస్ట్ అంటారని ఎక్కడో చదివాను.

నేను ఒక్కసారిగా వణికిపోతూ నా పైన కదులుతున్న బావ మొహంలోకి చూసాను.

బావ శాడిస్టా..

★★★



''సినిమాకెళ్దాం పద..'' అన్నాడు సాయంత్రం రాగానే బావ.

హాలు దగ్గర తను స్కూటర్ పార్క్ చేసి వచ్చేలోపు పూలు కనిపిస్తే కొన్నాను...తీరా చూస్తే రూపాయి తక్కువుంది చిల్లర. బావ వచ్చాకా అడిగితే తన దగ్గరా చిల్లర లేదన్నాడు.

''పోన్లెండమ్మా! ఫరవాలేదు లే..'' అన్నాడు పూలవాడు నవ్వుతూ.

మేం హాలులోకి వెళుతుంటే, ''వాడు నీకిదివరకే పరిచయమా? రూపాయి వదిలేసాడు..?'' అన్నాడు అదోలా నవ్వుతూ.

వెంటనే వెనక్కి తిరిగి ఇంటికెళ్ళిపోవాలనిపించింది.

సినిమా ఇంటర్వెల్‌లో, ''ఆ వెనక కూర్చున్నతను నీకు తెలుసా..?'' అన్నాడు.

నేను వెనక్కి తిరిగి చూసి, ''లేదు..ఏం?'' అన్నాను ఆశ్చర్యంగా.

''అతను అదోలా నీవైపే చూస్తుంటే నీకేమైనా పాత పరిచయమేమో అనుకున్నాను''

ఆ తర్వాత నేనింకెప్పుడూ బావతో బయటకెళ్ళలేదు.

**ఇవటూరి శ్రీనివాస్**

సంక్రాంతికి అమ్మావాళ్ళు మమ్మల్ని పిలిచారు. ఆ మూడు రోజులూ నేను చాలా హాయిగా గడిపాను..కనుమనాడు తమ్ముడూ, నేను మా పొలానికి వెళ్ళాం..చిన్నప్పటి నించి మేము ఆడుకున్నది అక్కడే..నాకక్కడ ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. తమ్ముడితో అదే మాట అంటూ, ''ఈ పొలం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మొద్దని నాన్నకి చెప్పాలి'' అన్నాను.

''అయితే నీకీ విషయం తెలీదా అక్కా..?''

ఏమిటన్నట్టు చూసాను.

''నిన్న మధ్యాహ్నం అత్తయ్య నాన్నతో ఈ పొలం విషయమే మాట్లాడింది. బావ ఏదో బిజినెస్ చేద్దామనుకుంటున్నాడట. దానికి డబ్బు కావాలిట. అందుకే ఈ పొలం అమ్మి డబ్బు ఇయ్యమని అడిగింది..''

''నాన్నేమన్నాడు...?''

''ఆలోచించి చెపుతానన్నాడు..''

ఆ రాత్రి అత్తయ్యా, బావా లేకుండా చూసి నాన్నతో చెప్పాను.

''నాన్నా..తాతయ్య పోయాక నీ చెల్లిగా ఆస్తిలో ఇవ్వాల్సిన దానికన్నా ఎక్కువే ఇచ్చావు. ఇప్పుడు నన్ను కావాలని అడిగి చేసుకున్నారు వాళ్ళే..అయినా కూడా నా అత్తగా తను అడిగినవన్నీ ఇచ్చావ్..దానికోసం చెరువవతల స్థలం అమ్మేసిన సంగతీ, అమ్మ బంగారం తాకట్టుపెట్టిన సంగతీ నాకు తెలుసు. ఇప్పుడింక తమ్ముడికి మిగిలింది ఈ స్థలమే. అది కూడా అమ్మేస్తే ఇక వాడికి మిగిలేదేమీ ఉండదు. అందుకే అది నువ్ అమ్మటానికి నేనెట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోను..''

అమ్మా వాళ్ళింటి దగ్గర్నించి వచ్చిన మర్నాడు..

మామూలుగా పొద్దున్నే ఆఫీస్‌కి వెళ్ళిపోయే బావ ఇంట్లోనే టీవీ చూస్తూ కూర్చున్నాడు.

పదకొండవుతుండగా ఎవరో నలుగురైదుగురు వచ్చారు. అంతా హాల్లో కూర్చుని పేకాడటం మొదలెట్టారు...పెద్దగా అరుపులూ, కేకలూ.

వంటింట్లోకి వెళ్ళాలన్నా రావాలన్నా ఆ హాల్లోంచే వెళ్ళాలి..దానికి తోడు బావ మంచినీళ్ళకని ఓసారీ, టీకని ఓసారీ పిలవటం మొదలెట్టాడు. ఆ మధ్యాహ్నం టీ పట్టుకెళ్ళినప్పుడు ట్రే అక్కడ పెట్టివస్తుంటే చీర తగిలి టేబుల్‌పైనున్న సిగరెట్ బాక్స్ కిందపడింది. నేను లోపలికి వచ్చేస్తుంటే అన్నాడు బావ-

''ఆ సిగరెట్ ప్యాకెట్ తీసి టేబుల్‌పైన పెట్టి వెళ్ళు..''

నేను కోపం అణుచుకుంటూ, ''అక్కడే ఉన్నావ్ కదా బావా..! తీసుకో'' అంటూ- వచ్చెయ్యబోతుంటే పెద్దగా అరిచాడు.

''మర్యాదగా అది తీసి టేబుల్‌పైన పెడతావా లేదా..?''

అంతా వినోదం చూస్తున్నారు.

నేను నెమ్మదిగా వెనక్కి వచ్చి అది తీసి టేబుల్‌పైన పెట్టి గబగబా వచ్చేసాను.

అప్పుడు ఏడ్చాను మొదటిసారి.

చిన్నప్పటినించీ నాకు మొండితనం ఎక్కువ. ఎవరేమన్నా పడేదాన్ని కాదు..ఏ పనైనా గట్టిగా కోప్పడుతూ చెపితే అసలు చేసేదాన్ని కాదు...''దీనికి పెళ్ళి చేస్తేనే కానీ ఈ పొగరు, రోషం పోవు'' అంది మా చుట్టాలావిడ ఓసారి. పెళ్ళి చేసుకోవటానికీ, రోషం పోవటానికీ సంబంధమేమిటో అపుడు తెలీలేదు. ఇప్పుడు తెలిసింది.

ఆ మర్నాడు వాళ్ళంతా మళ్ళీ వచ్చారు.

నేను మామయ్యని అడిగాను. ''బావ ఆఫీస్‌కి వెళ్ళటం లేదా?''

''లేదమ్మా..ఉద్యోగం మానేసాడట..''

''ఏదో బిజినెస్ చేస్తాడట'' అన్న తమ్ముడి మాటలు గుర్తువచ్చాయి.

నేనక్కడ ఉంటే నిన్నటి అనుభవమే మళ్ళీ జరుగుతుందని తెలిసి మా అత్తయ్యతో చెప్పి అమ్మావాళ్ళింటికి వెళ్ళాను.

''అదోలా ఉన్నావేమే..?'' అంది అమ్మ.

ఏం లేదంటూ దాటేసాను.

నేను వచ్చేస్తుంటే తమ్ముడు బయటకొచ్చి ''అక్కా! లంచం తీసుకుంటున్నారని బావని ఉద్యోగం నుంచి తీసేసారట..నిజమేనా?'' అన్నాడు.

''నిజమే అయి ఉంటుంది..'' అని చెప్పి వచ్చేసాను.

నేనింటికొచ్చేసరికి మా ఆడబడుచు నాకోసమే ఎదురుచూస్తోంది.

''పేరంటానికి వెళ్తున్నా వదినా..నీ గాజులోసారిస్తావా?'' అంది నవ్వుతూ.


నేనోక్షణం ఆలోచించి చెప్పాను.

''సారీ..ఇవి తీసేస్తే నాకు వేరే గాజులు లేవు. చేతులు బోసిగా ఉంటాయి. అన్నట్టు మొన్నామధ్య మీ ఫ్రెండ్ పెళ్ళికి వెళ్తూ నా గొలుసు తీసుకున్నావ్ కదా..అది మళ్ళీ ఇయ్యటం మరిచిపోయినట్టున్నావ్..''

అప్పట్నించీ మా అత్తయ్యా ఆడబడుచూ నాతో మాట్లాడటం మానేసారు. అన్నం తినటానికి కూడా నన్ను పిలిచేవారు కాదు. వాళ్ళు తిన్నాక నేను అన్నం తినటానికి వెళ్ళేసరికి గిన్నెలో కొంచెమే అన్నం మిగిలి ఉండేది.

★★★

మధ్యాహ్నం అత్తయ్య ఇంట్లో కనపడలేదు.




''మీ ఇంటికే వెళ్ళినట్టుందమ్మా!'' అన్నారు మావయ్య అడిగితే.

చీకటి పడుతుండగా వచ్చింది తను. అప్పటికి బావ కూడా వచ్చాడు. అంతా కలిసి హాల్లో సమావేశమయ్యారు. వాళ్ళ మాటల సారాంశాన్ని బట్టి నాకు తెలిసిందేమిటంటే నాన్న ఆ పొలం అమ్మనని తేల్చి చెప్పేసాడు.

''హమ్మయ్య'' అనుకుని ఊపిరి పీల్చుకున్నాను. వాళ్ళు చాలాసేపు ఏవో మాట్లాడుకుంటూ ఉన్నారు. నాకు నిద్రపట్టేసింది. పొద్దున్న పాలవాడు కేకేసేదాకా మెలకువ రాలేదు. అత్తయ్య పాలు పోయించుకుంటుంటే, ''కోడలుగారు లేరామ్మా..?'' అని వాడడగటం వినిపించింది.

నేను లేచి బ్రష్ చేసుకుంటుంటే బావ సిగరెట్ కాల్చుకుంటూ లోపలికి వచ్చాడు.

''పాలవాడు కూడా నిన్నే అడుగుతున్నాడు. వాడితో గ్రంథమేమైనా నడిపావా..?''

''....''

''మీ నాన్న బిజినెస్ కోసం డబ్బు అడిగితే లేదన్నాట్ట..''

''......''

''నేను నీకు ముందే చెప్పాను. నిన్ను పెళ్ళిచేసుకున్నది నీ అందం చూసి కాదనీ, మీ నాన్న ఆస్థికోసమేననీ..''

నేను జవాబు చెప్పకపోవటం చూసి ఇంకా రెచ్చిపోయి దగ్గరకొచ్చి...

''నీకు అందమైనదాన్నని గర్వం కదూ..చూడేం చేస్తానో..'' అంటూ కాలుతున్న సిగరెట్ నా చేతిమీద పెట్టాడు. [illegible]గా అరిచాను నేను బాధ తట్టుకోలేక. అలాగే నన్ను గట్టిగా అదిమిపట్టుకుని ఆ సిగరెట్ నా ఒంటిపైన కనిపించినచోటల్లా అంటించాడు. చేతుల మీదా...పొట్టమీదా...నడుం మీదా..గుండెలపైనా..ఆ సిగరెట్ అయ్యేదాకా కాలుస్తూనే ఉన్నాడు.

నేను బాధ తట్టుకోలేక అరుస్తుండగా స్పృహ తప్పింది.

కళ్ళు తెరిచేసరికి ఎదురుగా డాక్టర్ ఉంది.

''చూడమ్మా! కుక్కర్ వెయిట్ ఎగిరిపోయి అన్నమంతా నీ ఒంటిపై పడి కాలిందని చెపుతున్నాడు నీ భర్త..అది ఎంతవరకూ నిజమో నాకు తెలీదు కానీ నీ ఆరోగ్యం మాత్రం జాగ్రత్త..ఎందుకంటే నువ్ ఇప్పుడు ఒట్టి మనిషివి కాదు.''

నేను అమ్మనవుతున్న సంగతి వినగానే నాకెందుకో అమ్మని చూడాలనిపించింది. కానీ తను నన్నిలా చూసి తట్టుకోలేదు.

డాక్టర్ వెళ్ళిపోగానే. ''గుడ్..తల్లివి కాబోతున్నావన్నమాట. మరి తండ్రెవరో?'' అన్నాడు.

తను తండ్రినవుతున్నానని తెలియ

గానే ప్రపంచంలో ఏ భర్తా తన భార్యతో ఇలా మాట్లాడి ఉండడేమో..!

అప్పుడే అనిపించింది నాకు..నేనింకెంతోకాలం ఇలా సహనంగా ఉండలేనని.

ఆవేశంతో నేనలా పడుకునే ఉన్నాను. మా అత్తయ్యా, ఆడబడుచూ కనీసం ఆ గదిలోకి కూడా రాలేదు. మా మామయ్య మాత్రం మధ్యలో ఓసారి లోపలికొచ్చి ''ఏమైనా కావాలా..?'' అని కనుక్కుని వెళ్ళాడు.

సాయంత్రం..ఎవరో గదిలోకొచ్చిన అలికిడి విని కళ్ళు తెరిచి చూసాను.

లోపలికి రాగానే తలుపులు వేసేసాడు బావ..తన చేతిలో ఏదో నల్లటి బ్యాగ్.

''చూడు..డైరెక్ట్‌గా విషయానికొచ్చేస్తాను. నేనేమో ఉద్యోగం మానేసాను. బిజినెస్ చేస్తానంటే మీ నాన్న డబ్బులియ్యనంటున్నాడు. అందుకే ఓ నిర్ణయానికొచ్చాను.. నా బిజినెస్‌కి నువ్వే పెట్టుబడి..''

నేను అప్రయత్నంగా పైకి లేచాను..

ఆ బ్యాగ్ ఓపెన్ చేసి అందులోంచి ఓ వీడియో కెమెరా బయటికి తీసాడు.

''నీకర్థం కాలేదు కదూ..ఏం లేదు సింపుల్. విదేశాలలో అందమైన ఇండియన్ అమ్మాయిలని నగ్నంగా షూట్ చేసిన వీడియో క్యాసెట్‌కి మంచి డిమాండ్ ఉందట. నువ్ అందంగానే ఉంటావ్‌గా. అందుకే కాస్త కోపరేట్ చేసావనుకో..లక్షలు సంపాదించవచ్చు..''

దిగ్గున మంచం మీంచి కిందకి దూకి తలుపుకేసి పరిగెత్తాను. అది ఊహించని తను తేరుకుని నాకేసి వచ్చేలోపే గది తలుపులు తీసేసాను..బయటికి పరిగెత్తబోతున్న నన్ను చీరకొంగు పట్టుకుని గట్టిగా లాగాడు.

''వదులు'' అరిచాను...అంతగట్టిగా ఎలా అరవగలిగానో నాకే తెలీదు.

వదలకుండా అలాగే గట్టిగా పట్టుకుని నా దగ్గరకొచ్చి నన్ను గదిలోకి తోయబోయాడు.

నేనింక ఆలోచించలేదు..నా కుడికాలు పైకెత్తి..

ఫెడీల్మని తన్నాను బలంగా...

★★★

పాప నా జీవితాన్నే మార్చేసిందిప్పుడు..అది అమాయకంగా నవ్వుతూ నాతో ఆడుతుంటే నేనీ ప్రపంచాన్నే మరిచిపోతున్నాను.

పాప కొంచెం పెద్దదయ్యాకా నేనో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంలో జాయినయ్యాను.

రోజూ ఆఫీస్‌కి వెళ్తుంటే అమ్మమ్మ చంకలో ఉండి నవ్వుతూ టాటా చెపుతోంది పాప.

సాయంత్రం ఇంటికొస్తుంటే దూరం నించే నన్ను చూసి పరిగెత్తుకొచ్చేస్తుంది.

నా డిగ్రీ రిజల్ట్స్ వచ్చాయి...ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను..ఆఫీస్‌లో ప్రమోషన్ ఇచ్చారు. స్వీట్స్ తీసుకుని రోజూ కన్నా తొందరగా ఇంటికొచ్చేసాను.

అమ్మగదిలో ఏదో పనిలో ఉంది. పాప అక్కడే బొమ్మలతో ఆడుకుంటోంది.

అందరికీ స్వీట్స్ ఇచ్చాకా పాపకూడా ఇస్తుంటే స్వీట్ తీసుకుంటూ నా చెయ్యి మీద చూపిస్తూ అడిగింది పాప.

''ఇదేంటమ్మా..?''

అది బావ కాల్చిన సిగరెట్ మచ్చ.

'' ఆయి అయిందమ్మా!'' అన్నాను నవ్వుతూ.

''నొప్పెడుతోందా..మందు రాయనా..?'' అంది ఆరిందాలా మొహంపెట్టి.

''నా మనసుకి అయిన గాయాలన్నిటికీ నువ్వే మందు రాస్తున్నావమ్మా..!'' అంటూ దాన్ని కౌగలించుకుని ఆనందంగా ఏడుస్తుంటే..అమ్మ పిలిచింది.

పాపనెత్తుకుని తనకేసి నడిచాను..ఏమీ మాట్లాడకుండా చేతులు చాపింది.

నేను మౌనంగా అమ్మ చేతులమధ్య ఒదిగిపోయాను.

అలా ఎంతసేపున్నామో..?

అమ్మ కౌగిట్లో నేను..నా కౌగిట్లో పాప..పాప కౌగిట్లో బొమ్మ..ఆడపిల్ల బొమ్మ...హఠాత్తుగా అమ్మ అడిగింది.

''రేపు పాప పెద్దయ్యాకా వాళ్ళ నాన్న గురించి అడిగితే ఏం చెబుతావే..?''

''చెపుతానమ్మా..నా కథంతా దానికి చెపుతాను. అది అర్థం చేసుకుంటుందనే అనుకుంటున్నాను..అదీ అమ్మాయేగా...అమ్మ అవుతుందిగా'' అన్నాను ధీమాగా పాపని ముద్దుపెట్టుకుంటూ...

★

ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం

**ముత్యాల సరాలు**

# కలిమి కన్న ప్రేమ మిన్న

కాలపరిభ్రమణంలో ప్రాపంచిక జీవిత విలువలు పరిపరి విధాల పరిణామం చెంది చిట్టచివరకు నట్టనడిబజార్న పడి వికృతంగా విలయతాండవం చేస్తున్నాయి. దైవప్రసాదితమైన కలిమికి కొలువుచేస్తూ దైవాన్ని విస్మరిస్తున్నాడు నేటి మానవుడు. సంపన్నులకు విలువ, సంపన్న సాంఘిక వర్గాలకు విలువ, సంపన్న దేశాలకు విలువ. పేదల పట్ల మాత్రం పేలవంగా తేలిపోయే మొసలి కన్నీటి మాటల మూటలు. లేమి గలవారిని ప్రేమగా చూస్తే కలిమి కరిగిపోతుందని భయం.

యేసుక్రీస్తు జీవించిన రోజుల్లో ధనికుడైన యువకుడొకడు ఆయన్ని అడిగాడట, స్వామీ, స్వర్గానికి వెళ్లాలంటే చేయవలసిన సత్కార్యాలేమిటని. దైవాజ్ఞలను పాటించమన్నాడాయన. ఏ ఆజ్ఞలు? యువకుడి ప్రశ్న. అందుకు యేసు జవాబు : నరహత్య చేయరాదు. వ్యభిచరించరాదు. దొంగతనం చేయరాదు. దొంగ సాక్ష్యం చెప్పరాదు. తల్లిదండ్రులను గౌరవించాలి. నిన్ను నువ్వు ప్రేమించుకున్నంతగా ఇతరులను ప్రేమించాలి. "ఇవన్నీ చేస్తున్నాను ప్రభూ. ఇంకా ఏమైనా"... ప్రేమించడమంటే ఏమిటో విప్పిచెప్పాడు: నీవు పరిపూర్ణ స్థాయి సాధించాలంటే, నీకున్న ఆస్తి అమ్మి, బీదలకు పంచి, నీవు నన్ను వెంబడించు". కొండల బండలు క్రిందకు దొర్లగా, గుండెలు పిండిన రక్తస్రావం. చిన్నబుచ్చుకున్న చిన్నవాడు విచారంతో వెనుదిరిగాడు.

ఈ ఉదంతంలో యేసుక్రీస్తు బోధల సారాంశం సంపూర్ణంగా సాక్షాత్కరిస్తుంది. నిన్ను నీవు ఎలా ప్రేమించుకుంటావో నీ చుట్టూ ఉన్నవారిని అలా ప్రేమించు. స్వనీతిని, సంపదను కాదు, దైవాన్ని దైవాజ్ఞలను అనుసరించు, కలిమిని కాదు, దాన్ని కలిగించిన వాణ్ణి పూజించు. ఎన్నో ఇలాంటి ప్రబోధాలున్న గ్రంథం ఒకటుంది. పేరు "ప్రేమ, సంతోషం, సమాధానం", 306 పేజీలు, యేసుక్రీస్తును గురించి తెలుసుకోవాలంటే మాకు వ్రాయండి. ఆయన జీవిత చరిత్ర, ప్రబోధాలు, వాటిపై వ్యాఖ్యలు ఉన్న ఆ పుస్తకాన్ని ఉచితంగా పంపిస్తాం.

**నిరీక్షణ**

ఇదీ అడ్రస్

**పోస్టుబాక్సు నం. 608, విశాఖపట్నం - 530 013, ఆంధ్రప్రదేశ్**

ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం ఉచితం